ప్రజాశక్తి

బుధవారం 5 మార్చి 2025

5

పార్వతీపురం మన్యం

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులుగా సుధారాణి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆమె కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

-ప్రజాశక్తి- పార్వతీపురం

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడరా?

- మంత్రి ఇలాకాలో మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు
- నిధుల్లేక నీరసించి పోతున్న మున్సిపాలిటీ

ప్రజాశక్తి - సాలూరు

'పట్టణంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు మురికివాడల్లో మహిళలు చెప్పిన సమస్యలు నాకు ఇంకా గుర్తున్నాయి, సామాజిక మరుగుదొడ్లు వినియోగంలో లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు నాతో చెప్పారు, మహిళలు ఆత్మగౌరవం కాపాడలేని స్థితిలో ఉన్నందుకు చింతిస్తున్నా, వారం రోజుల్లో పట్టణంలోని సామాజిక మరుగుదొడ్లు మరమ్మతు చేయాలి, నిధులు లేకపోతే జిల్లా కలెక్టర్‌ను అడిగి నేను మంజూరు చేయిస్తా' అని సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన రోజు అన్నారు. మంత్రిగా ఆమె పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కొద్ది రోజుల్లోనే మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ సందర్భంలో విలేకరులతో మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలు ఇప్పటికీ పట్టణ ప్రజలకు గుర్తున్నాయి. దాదాపు 8నెలల క్రితం ఆమె మున్సిపల్ అధికారులకు వారం రోజుల్లో సామాజిక మరుగుదొడ్లు మరమ్మతు చేయాలని అల్టిమేటం ఇచ్చారు.

పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న మురికివాడల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మించారు. దాదాపు 20 ప్రదేశాలలో ఉన్న మరుగుదొడ్లు మరమ్మతుకు నోచుకోక నిరుపయోగంగా వున్నాయి. దీని ఫలితంగా ఆ మురికివాడల్లో నివసించే మహిళలు బహిర్భూమికి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుమారు రెండేళ్లుగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మరుగుదొడ్ల తలుపులు ఛిద్రమవ్వడం, రన్నింగ్ వాటర్ సౌకర్యం లేకపోవడంతో అవి వినియోగంలో లేవు. ఈ మరుగుదొడ్ల మరమ్మతు పనులకు రూ.20లక్షల నిధులు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. అయితే మరుగుదొడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు మున్సిపాలిటీ ఖజానా లేవు. మున్సిపల్ జనరల్ ఫండ్‌లో ఉన్న నిధులు మున్సిపాలిటీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలకే సరిపోవడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో సామాజిక మరుగుదొడ్లు మరమ్మతు చేయలేమని అధికారులు ఎప్పుడో చేతులెత్తేశారు. ఈ విషయాన్ని మంత్రి సంధ్యారాణి దృష్టికి కూడా తీసుకెళ్ళారు. నిధులు లేకపోతే జిల్లా కలెక్టర్‌ను అడిగి తీసుకొస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఆమె జిల్లా కలెక్టర్‌ను అడిగారా, అడిగినా కలెక్టర్ నిధులు లేవన్నారేమో గాని సామాజిక మరుగుదొడ్ల మరమ్మతు పనులు మాత్రం ఎక్కడా వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలాయి. మరో రెండు నెలల్లో శ్యామలాంబ గ్రామదేవత పండుగ పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నారు. లక్షలాది మంది దూరపు బంధువులు, స్నేహితులు పండగకు రానున్నారు. మురికివాడల్లో నివశించే పేద మహిళలకు సామాజిక మరుగుదొడ్లే దిక్కు.అలాంటి పరిస్థితుల్లో వాటిని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం చాలా ఉంది. మరుగుదొడ్ల మరమ్మతులకు అవసరమైన రూ.20 లక్షలు మంజూరు చేయలేని దుస్థితిలో మున్సిపాలిటీ వుందనే విషయం స్థానిక మంత్రికి తెలిసినప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిధులు మంజూరుకు కృషి చేయకపోవడం చర్చనీయాంశమవుతోంది. ఎనిమిది నెలలవుతున్నా మరుగుదొడ్ల మరమ్మతు పనులపై మంత్రి హామీ నీటి మీద రాత లా మిగిలింది.

పట్టణంలో మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు

భూ యజమానుల సమక్షంలో రీ సర్వే : కలెక్టర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

భూ యజమానుల సమక్షంలో రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పైలెట్ గ్రామంగా దలైవలసలో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. రైతులతో ముఖా ముఖి నిర్వహించారు. రీ సర్వేలో గ్రామ భూ విస్తీర్ణం, ఇప్పటి వరకు పూర్తి చేసిన సర్వే, ఇంకా చేపట్టనున్న సర్వే వివరాలను తహశీల్దార్ పి.బాలను అడిగి తెలుసుకున్నారు. భూమి కొలతలు వేసే ముందు రైతులకు ఫారం -19 నోటీసులు ఇస్తున్నదీ, లేనిదీ, అడంగల్‌లోని రైతుల పేరున ఉన్న భూవిస్తీర్ణం కచ్చితంగా కొలతలు వేస్తున్నారా, లేదా అనే విషయాలపై ఆరా తీశారు. భూ యజమానులకు నోటీసులు జారీ చేసి వారి సమక్షంలోనే కొలతలు వేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో 676 ఎకరాల్లో సర్వే పూర్తికావాల్సి ఉండగా, 573 ఎకరాలు సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలోనే రోవర్ సహాయంతో ఖచ్చితమైన హద్దులను నిర్ణయించి రైతులకు భూమిని అప్పగించాలని సూచించారు. సర్వేలో లోపాలు, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని భూ యజమానులకు కోరారు. రీ సర్వే కొలతల్లో తేడా రాకుండా రైతులు చూసుకోవాలని కోరారు. సర్వేలో పొరపాట్లకు తావివ్వరాదని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. గ్రామ కంఠం భూమి గుర్తించి హద్దులు నిర్ణయించాలన్నారు. చెరువు ఆక్రమణలను ఉపేక్షించేది లేదని, ఎక్కడైనా దురాక్రమణలుంటే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి గోపాలరావు, ఆర్ఐ శ్రీనివాస్, విఆర్ఒ వి.శ్రీనివాస్, సర్వేబృందం, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలిస్తున్నకలెక్టర్ శ్యామ్ ప్రసాద్

గిరిజన సంక్షేమశాఖ పనుల తనిఖీ

పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్పి ప్రసాదరావు

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గురువునాయుడుపేట లో గిరిజన సంక్షేమశాఖ చేపట్టిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులను విజిలెన్స్ ఎస్పి బర్ల ప్రసాదరావు మంగళవారం పరిశీలించారు. పనుల పరిశీలనకు విచ్చేసిన ఎస్పీ, ఆమోదం పొందిన ప్రణాళిక ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నదీ లేనిదీ తనిఖీ చేస్తున్నామని, నాణ్యత పరీక్షలు చేసిన పిదప పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డిఇ సత్యనారాయణ, ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ మణిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏగులవాడలో ఆర్‌డబ్ల్యుఎస్ పనులను పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

పిఎం జన్‌మన్ పనులు వేగవంతం : పిఒ

ప్రజాశక్తి - కురుపాం/ గుమ్మలక్ష్మీపురం :

మండలంలో శారదాపురంలో నిర్మితమవుతున్న పిఎం జన్ మన్ పనులు వేగవంతం కావాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పిఎం జన్ మన్ కింద ఇచ్చిన లక్ష్యాల దిశగా అధికారులు కృషి చేయాలన్నారు. ఏగులవాడలో చేపడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం శారదాపురం, ఎగులవాడలోని అంగన్వాడీ కేంద్రాలను, జిపిఎస్ ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, గుమ్మలక్ష్మీపురంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. పాఠశాలల్లో అందించే వసతుల్లో లోటు పాట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులను పిఒ కోరారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎంటిసి ఎస్కే పాడును సందర్శించిన ఆయన పనుల పురోగతిని డిఇ, ఎఇని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ, ఎఇలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలు సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని టిటుకుపాయి, కుసుమూరు, టిటుకుపాయిగూడ గ్రామాల్లో ఎంపిడిఒ కె.గీతాంజలి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ నిధులతో జరుగుతున్న రోడ్లు, ప్రహరీ గోడ పనులను పరిశీలించారు. టిటుకుపాయిలో ఇంటర్నల్ రోడ్, దోనుబాయిలోని పిహెచ్‌సి ప్రహరీ గోడ, సీసీ రోడ్ల పనులను పరిశీలించారు. గుమ్మడ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతతో శరవేగంగా పూర్తి చేయాలి అన్నారు. ఇంటి నుంచి పనిచేస్తున్న వారు ఇంటి నుంచి పనిచేయటానికి ఆసక్తి ఉన్నవారు, 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న గ్రామస్తులను తప్పనిసరిగా ఈ సర్వేలో నమోదు చేయాలని సూచించారు. వేసవిలో నీటికి ఇబ్బంది రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.రాజశేఖర్, వెల్ఫేర్ అసిస్టెంట్ రాము, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అరవింద్, మహిళా పోలీస్ విజయశాంతి, డిజిటల్ అసిస్టెంట్ అమల, ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా..

ఐసిడిఎస్ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీని మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఐటిడిఎ కార్యాలయం నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసిడిఎపి పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, సిడిపిఒలు, సూపర్వైజర్లు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో మెయిన్ రోడ్ నుండి బోసు బొమ్మ జంక్షన వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే మహిళా సాధికారిక సాధించినట్లు అవుతుందని, దీనికోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సాలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పిఒ విజయలక్ష్మి, సూపర్వైజర్లు అనురాధ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కురుపాం : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఐసిడిఎస్ సిడిపిఒ కె.విజయ్ గౌరి ఆధ్వర్యంలో రావాడ రామభద్రపురం పిహెచ్‌సిలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిహెచ్‌సి వైద్యాధికారి చీకటి శంకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సిడిపిఒ విజయగౌరి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొమరాడ : మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని ఐసిడిఎస్ కొమరాడ ప్రాజెక్ట్ అధికారి జి.సుగుణ అన్నారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం వద్ద మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మహిళలకు యోగాతో పాటు పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు రక్తహీనత నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే పౌష్టిక ఆహారాన్ని క్రమం తప్పకుండా వినియోగించుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని అన్నారు. మహిళా దినోత్సవ సందర్భంగా కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు శారదాంబ, అరుణ, లక్ష్మి సిబ్బంది తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి గొట్టాపు సుగుణకుమారి అన్నారు. గరుగుబిల్లి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోర్టుఫైడ్ బియ్యంతో వంటకాలు తయారీని ప్రదర్శించడంతో పాటు హెల్తీ వుమెన్...హ్యాపీ ఉమెన్ పేరిట యోగా, ధ్యానం, తది తర కార్యక్రమాలను నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు బాలసంజీవిని కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రౌతు లక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పార్వతీపురంలో కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న మహిళలు

కురుపాంలో యోగాపై అవాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఈనెల 8న ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఛాంబరులో మహిళా దినోత్సవ వేడుకలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆనాటికి ఎన్నికల కోడ్ ముగిసే అవకాశం ఉన్నందున మహిళా దినోత్సవ వేడుకలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. జిల్లాలో ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహిళలను గుర్తించి, వారి విజయగాధలతో ఇతర మహిళల్లో స్ఫూర్తిని నింపాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, గిరిజన సంస్కృతి - సంప్రదాయాలను కాపాడే మహిళలు, ఇతరులకు రోల్ మోడల్‌గా నిలిచిన మహిళలను సన్మానించాలని కలెక్టర్ చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి సహాయం పొంది ఆర్థికంగా ఎదిగిన మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలని, బ్యాంకు లింకేజీలను ఈ వేడుకల్లో ప్రమోట్ చేయాలని సూచించారు. మహిళలకు మెగా చెక్కుల పంపిణీ వంటివి చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎఎస్‌పి సురాన అంకిత్ మహావీర్, డిఆర్ఒ కె.హేమలత, జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారి డాక్టర్ టి.కనకదుర్గ, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎంవి కరుణాకర్, ఐపిఒ వికె వర్ధన్, ఎల్డీఎం ఎన్.విజయ్ స్వరూప్, డీఎస్డీఒ కె.సాయికృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి చౌకబారు ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు యుటిఎఫ్‌పై చౌకబారు ఆరోపణలు మానుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్‌రావు డిమాండ్ చేశారు. ఇటీవల ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి కూటమి మద్దతు పలికిన ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ ఓడిపోవడాన్ని అంగీకరించకుండా యుటిఎఫ్ ముసుగులో వైసిపి అభ్యర్థిని నిలబెట్టిందని చెప్పడం చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. గెలిచిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడు తమ అభ్యర్థేనని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను టిడిపి కూటమి పార్టీలు రాజకీయ క్రీడలకు వాడుకున్నాయని విమర్శించారు. పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడుకు వైసిపి మద్దతు పలికితే యుటిఎఫ్‌పై బురద చల్లడం విడ్డూరంగా ఉందని మురళీమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గోడౌన్‌ను పరిశీలిస్తున్న డిఎం మహేంద్రకుమార్

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అటవీ ఉత్పత్తులు కొనుగోలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని జిసిసి జిల్లా మేనేజర్ యు.మహేంద్రకుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన స్థానిక జిసిసి బ్రాంచ్ కార్యాలయం, బియ్యం, గ్యాస్ స్టాక్ గోదాములను ఆయన సందర్శించారు. నిత్యవసర వస్తువులు, డిఆర్ డిపోలకు కంపెనీ విధానం అమ్మకాలపై సిబ్బంది దృష్టి పెట్టాలని సూచించారు. సిబ్బంది వారికి కేటాయించిన శాండీ పాయింట్ల వద్ద చింతపండు, ఇతర అటవీ ఫలసాయాలను కొనుగోలు చేయాలని, అటవీ ఉత్పత్తులను గోదాములకు వెంటనే తరలించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మినిమం సపోర్ట్ ప్రైస్ చింతపండు కిలో రూ.36కు, అడవి తేనె కిలో రూ.300కు, నల్లజీడి కిలో రూ.35కు కరక్కాయలు రూ.20, రాగులు రూ.35, ముసిడిగ పిక్కలు రూ.100, పసుపు రూ.100, మారేడు గడ్డలు కిలో రూ.450కు ధరలు పెంచడం జరిగిందని, గిరిజన రైతులంతా సద్వినియోగం చేసుకుని అటవీ ఉత్పత్తులన్నింటిని జిసిసికి అమ్మకాలు జరపాలని కోరారు. గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన వస్తువులకు వెంటనే నగదు చెల్లింపులు జరపాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ కృష్ణప్రసాద్, గోదాము ఇన్‌ఛార్జి సాంబశివరావు ఉన్నారు.

రక్తదానం.. ప్రాణదానం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రక్తదానం ప్రాణదానంతో సమానమైందని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. మంగళవారం హుల్లైన్ మేన్ దివాస్ పురస్కరించుని పట్టణంలోని బెలగాం గుడ్ షెడ్ రోడ్‌లో ఉన్న ఎపిఇపిడిసిఎల్ కార్యాలయ వద్ద ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేను సైతం ' రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దాతలు రక్త దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడవచ్చున్నారు. రక్తదానానికి మించిన దానం లేదని పేర్కొన్నారు. ప్రతి ఆరు మాసాలకు రక్తదానం చేయవచ్చని అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రోగులకు ప్రమాదకర సమయంలో రక్తం కోసం ఆశ్రయిస్తున్నారని తెలిపారు. రక్త నిల్వలు అందుబాటులో ఉంచేందుకు జిల్లాలో నాలుగు బ్లడ్ బ్యాంక్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తాన్ని అందించేందుకు జిల్లాలో రక్త నిల్వలు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు మరిన్ని రక్త దాన శిబిరాలు నిర్వహించాలని, యువత రక్తదానం చేసేందుకు ముందుకొచ్చి సేవాభావం పెంపొందించుకోవాలని కోరారు. రక్త దాన శిబిరంలో దాతల నుంచి 89 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు మెడికల్ ఆఫీసర్ తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. అంతకు ముందు విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ స్వయంగా మొక్కలను నాటారు. మొక్కల సంరక్షణకు అందరూ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసి ఎల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.చలపతి రావు, కార్యనిర్వహక ఇంజనీర్ కె. గోపాల్ రావు నాయుడు, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వాగ్దేవి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్ ప్రేమ్, డిఎల్ఒ డ్టార్ వినోద్, డిప్యూటీ ఇఇ సీహెచ్.వెంకట రమణ, సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణాన్ని పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని కాపు కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి మండల కన్వీనర్ ఎస్ శేఖర్ పాత్రుడు అన్నారు. మండలంలోని పూర్ణపాడు- లాబేసు మధ్య అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను, ఒఎస్‌డి వెంకటకృష్ణను కోరారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయం ఉప ముఖ్యమంత్రి పేషీలో మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. నాగావళి నదిపై వంతెన నిర్మాణ ఆవశ్యకతను వివరించినట్లు ఆయన తెలిపారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలోని ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో గత ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందన్నారు. కావున అవసరమైన నిధులు కేటాయించి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో సభావేదిక ప్రారంభం

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థి మండవిల్లి నారాయణరావు రూ.లక్షా 75వేలతో సభావేదికను నిర్మించారు. తాను చదువుకున్న స్కూలుకు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఈ నిర్మాణం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రారంభ ఆహ్వానితులుగా విచ్చేసిన డిఇఒ తిరుపతినాయుడు మాట్లాడుతూ చదువుకున్న స్కూలులో చేసిన ఈ సేవా కార్యక్రమం నేటి సమాజానికి స్ఫూర్తి అని కొనియాడారు. రేపటి సమాజానికి మేలు కొలుపని దాత నారయణ రావును అభినందించారు. మంచి కార్యక్రమానికి నిర్వహణా బాధ్యతలు చేపట్టిన ప్రధాన ఉపాధ్యాయులు దత్తి అప్పలనాయుడు, స్టాఫ్ సెక్రటరీ కెవి సత్యనారాయణ, సిబ్బంది అభినందనీయులు అన్నారు. అనంతరం 10 వ తరగతి విద్యార్థులతో పరీక్షా పై చర్చా కార్యక్రమం చేస్తూ బాగా రాసేలా విధంగా మంచి సూచనలు ఇచ్చారు. ఉపవిద్యాశాఖాధికారి రాజకుమార్ మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివే పూర్వవిద్యార్థులు చాలా ఉన్నత స్థానంలో ఉన్నారని నారాయణ రావు నిర్మించే ఈ సభావేదిక ప్రతీ విద్యార్థికి స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాసర్ల అప్పారావు, గాడి స్వామునాయుడు, మామిడిపాక ప్రసాద్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జ్యోతి పాల్గొన్నారు.



సభావేదికను ప్రారంభిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

ప్రజాశక్తి
www.prajasakti.com

కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

ఉపాధి పనిదినాలు పెంచాలి : వ్యకాస

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

వ్యవసాయ కార్మికులుకు ఉపాధి పనిదినాలు పెంచాలని, కూలీ రోజు రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. జియ్యమ్మవలసలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ఇంటి నిర్మాణానికి 3 సెంట్లు ఇళ్ల స్థలం, నిర్మాణానికి రూ.6 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేట్లుకు రూ.5వేలు పారితోషకం ఇవ్వాలన్నారు. ప్రతి దళిత కాలనీకి 2 ఎకరాల శ్మశాన స్థలం కేటాయించాని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈనెల 12న చలో విజయవాడ నిర్వహిస్తున్నామని, ఇందుకు వ్యవసాయ కార్మికులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బి.మోహనరావు, గిరిజన సంఘం నాయకులు కె.సీతారాం పాల్గొన్నారు.

6న మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువ జంక్షన్ వద్ద గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈనెల 6న మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన వారు ఆరోగ్యశ్రీ ఆధార్ కార్డుతో పాటు ఇతర గుర్తింపు కార్డులు బ్యాంకు ఖాతా, ఫోన్ నెంబర్, రెండు జతల బట్టలు, కంచం, గ్లాసు తప్పనిసరిగా తమ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

శుద్ధ జలాల సరఫరాకు చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

శుద్ధ జలాల సరఫరాకు మెరుగైన చర్యలు చేపడుతున్నామని మున్సపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను, తాగునీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలిస్తూ, తాగునీటి సరఫరా జరుగుతున్న పరిస్థితిపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, శుద్ధజలాల సరఫరాకు మున్సిపల్ ఇంజినీరింగు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, ఏ వార్డుల్లోనైనా కుళాయిల ద్వారా కలుషిత నీటి సరఫరా జరిగితే దగ్గరలో ఉన్న సచివాలయాల ఇమ్యూనిటీ సెక్రటరీలకు గానీ, మున్సిపల్ కార్యాలయానికి గాని ఫిర్యాదు చేయాలని అన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

ఆరోగ్య కేంద్రాల్లో డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి -పాలకొండ

అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తనిఖీ చేశారు. మంగళవారం ఆయన పాలకొండలోని అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. డ్రగ్ స్టోర్, ల్యాబ్, ఒపీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా నిర్మిస్తున్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ప్రైవేట్ హెల్త్ కేర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఎం.సింగుపురం పిహెచ్‌సిని పరిశీలించారు. ఆయనతో డెమోలు యోగేశ్వరరెడ్డి, సన్యాసిరావు, డిఎస్ఒ శంకరరావు, పాలకొండ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కొక్కిరపాటి తేజ్ రత్న రాజ్, డాక్టర్ వెన్నెల, డాక్టర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న సవరపు రామారావు

ఎస్‌సి, ఎస్‌టి హక్కుల పరిరక్షణ సభ్యుడిగా సవరపు

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని పెదబోగిలికి చెందిన సవరపు రామారావుకు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి సభ్యునిగా ఉత్తరోపత్రాలను రాష్ట్ర అధ్యక్షులు బుల్ల రాజారావు మంగళవారం అందజేశారు ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలు, సమస్యలు పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తనను ఎంపిక చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి డ్రోన్ సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గంజాయి, సారా అక్రమ రవాణాతో పాటు పలు రకాల అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి డ్రోన్ సేవలు వినియోగిస్తున్నట్లు రూరల్ ఎస్సై సంతోషి కుమారి తెలిపారు. మండలంలోని పెద్దమరికి, గోచెక్క, వెలగవలస, ఆడారు పంచాయతీల్లో గల మారుమూల ప్రాంతాలను డ్రోన్ కెమెరా ద్వారా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ వారి సూచనల మేరకు నేరాల నిరోధానికి ఆధునిక, సాంకేతిక ప్రక్రియను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

తాడికొండలో ఫాగింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

దోమల నియంత్రణకు మండలంలోని తాడికొండలో మంగళవారం ఫాగింగ్ కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో ప్రతి వీధిలో ఇంటింటికి వెళ్లి ఫాగింగ్ చేశారు. దోమ కాటు నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు ఫాగింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు తెలిపారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా ఎంటిఎస్ కేశవ నాయుడు వైద్య సిబ్బంది, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాలపై నిర్లక్ష్యం తగదు

6న చలో విజయవాడ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం నిర్లక్ష్యం సరికాదని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.గంగు నాయుడు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 6న తలపెట్టిన చలో విజయవాడలో ఆశా కార్యకర్తలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో జియ్యమ్మవలస, రావాడ రామబద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారులకు వినతి పత్రాలు అందించారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం ఆ దశగా చర్యలు చేపట్టలేదు అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి.ఇందిర, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు జానకి, సింహాద్రిమ్మ, సుశీల, మంజు, కమల, గిరిజన సంఘం నాయకులు కె సీతారాం పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ఈనెల 6న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా ఉన్న ఆశా వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ఇందిరా, కోశాధికారి గొర్లి వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలలోని పెదబొండపల్లి, బందలుప్పి, డోకిశిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.గౌరీశ్వరి, కార్యదర్శి ఎం.శివానితో కలిసి వైద్యాధికారులకు చలో విజయవాడ కార్యక్రమానికి అనుమతులు ఇవ్వాలని కోరుతూ వినతులను అందజేశారు. కార్యక్రమంలో ఆయా పిహెచ్‌సిల పరిధిలోని ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్వతీపురం : వైద్యాధికారికి వినతిని అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

కొమరాడ : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 6న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు కొమరాడ, కెఆర్‌బి పురం పిహెచ్‌సిలో వైద్యాధికారులకు సిఐటియు ఆధ్వర్యాన వినతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఆశా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 6న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో మామిడిపల్లి, బాగువలస, తోణాం మెడికల్ ఆఫీసర్లకు మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మరియమ్మ, ఆర్.రవణమ్మ, కోనేటి సరోజిని, ఆదిలక్ష్మి, త్రివేణి, రాజేశ్వరి, శ్రీదేవి, లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం. శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు ఎన్ వై నాయుడు పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి కొమరాడ



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు తిరుపతిరావు

మండలంలోని పెద్దశాఖలో తాగునీటి పథకం పనులను త్వరితగా పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పెద్దశాఖలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎం.తిరుపతి రావు మాట్లాడుతూ గ్రామంలో 250 కుటుంబాలు ఉంటున్నప్పటికీ కనీసం మంచినీటి సౌకర్యం లేదని ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. గతంలో నిర్మించిన ట్యాంకు మరమ్మతులకు గురై అనేక ఏళ్లు గడుస్తున్నా, దీనికి ప్రత్యామ్నాయంగా కొత్త ట్యాంక్‌ను నిర్మించి అనేక నెలలు గడుస్తున్నప్పటికీ నేటికీ పూర్తి కాకపోవడం విడ్డూరమని అన్నారు. బోర్లు పూర్తిగా మరమ్మతులకు గురయ్యాని తెలిపారు. ప్రజల సమస్యలను విన్నవించుకునేందుకు అందుబాటులో సచివాలయం ఉన్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంతో సమస్యలు ఊరు దాటే పరిస్థితి లేదని వాపోయారు. సిబ్బంది సిగ్నల్ సమస్య కారణం చూపి కూనేరులో విధులు నిర్వహిస్తుండడం దుర్మార్గమని, వెంటనే ప్రజలకు చేరువలో సిబ్బంది ఉండాలని కోరారు. ప్రజలకు సేవలందించే వైద్య కేంద్రాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, ప్రజల ఆరోగ్య స్థితిగతులపై నిరంతరం కృషి చేయాలని సిబ్బందిని కోరారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో నీటి కొరత లేకుండా ఉండాలని నిరంతరం కలెక్టర్ సమావేశం పరచడమే తప్ప, ఆచరణలో శూన్యమని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, పి.రాజశేఖర్ ఉన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి కలగాలి ... జంఝావతి పూర్తి కావాలి

ప్రజాశక్తి - కొమరాడ

మోకాలిపై నిల్చొని నిరసన తెలుపుతున్నఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు

జంఝావతి ప్రాజెక్టు విషయమై ప్రభుత్వానికి బుద్ధి కలగాలని... ప్రాజెక్టు పూర్తి కావాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు అన్నారు. ఆ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, ప్రతినిధులు వి.శ్రీహరి, టీ. ప్రభాకరరావు, బి.కృష్ణ తదితరులతో కలిసి మంగళవారం జంఝావతి ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా జంఝావతి నదికి పుష్పాభిషేకం చేశారు. అనంతరం ఒంటి కాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో జంఝావతి ప్రాజెక్టుకు రూ.10 వేలు కేటాయించడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జంఝావతికి బడ్జెట్లో ఎటువంటి ప్రాధాన్యత లేకపోవడంతో మనసు కలత చెంది ప్రాజెక్టును పరిశీలించామన్నారు. ఈ విషయం పూర్తిగా ఈ ప్రాంత ప్రజాప్రతినిధుల వైఫల్యమేనన్నారు. ఒడిశాతో ఉన్న అతి చిన్న సమస్యను కూటమి అనుకూల ప్రభుత్వాలు ఉండడంతో అతి సులభంగా పరిష్కరించవచ్చన్నారు. అయితే పాలకులు ఆ దిశగా ఆలోచించకపోవడం బాధాకరమన్నారు. జంఝావతి పూర్తయితే రైతుల వలసలు తగ్గుముఖం పడతాయన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జంఝావతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సాగునీరందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రాంత పాలకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. లేనిపక్షంలో జంఝావతి ప్రాజెక్ట్‌ను సాధించేందుకు కార్యాచరణ రూపొంది స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సమితి ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

మన్యంలో మణిపూస

వెంకయ్య నాయుడు చేతుల మీద డాక్టర్ పట్టా అందుకున్న వంశీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

చిన్నప్పుడు పిల్లలను అడుగుతుంటాం నాన్న నువ్వు ఏమవుతావు అని నేను డాక్టర్ నౌతా వారు చెప్పే సమాధానం తల్లిదండ్రులకు ఎంతో ఆనందం కలిగిస్తుంది. అదే పెద్దయ్యాక డాక్టర్ అయితే ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులే ఉండవు. మండలంలోని దుమ్మంగికి చెందిన భోగాపురపు వంశీ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా విశాఖపట్నంలో డాక్టర్ పట్టా అందుకున్నారు. వంశీ చిన్నప్పటినుంచి డాక్టర్ కావాలని, ఏజెన్సీలో ప్రజలకు సేవ చేయాలని అన్నదే ఆయన కల. ఆ లక్ష్యంతోనే క్రమశిక్షణ, నిబద్ధత తో వైద్య విద్యను పూర్తి చేశారు. వంశీ డాక్టర్‌గా ఉద్యోగం పొందడం పట్ల తల్లిదండ్రులు వెంకటరావు, వసంత ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు వాలీబాల్ పోటీలు

గుమ్మలక్ష్మీపురం :ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ ఆవరణంలో బుధవారం వాలీబాల్ క్రీడ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు వాలీబాల్ క్రీడల్లో పాల్గొనాలని కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10000 , ద్వితీయ బహుమతి రూ. 5000 నగదు టోపీలు అందజేస్తామన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యం మెరుగుకు కృషి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మెరుగైన ఆరోగ్య అంశాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన పెంపొందించాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు పేర్కొన్నారు.స్థానిక పిహెచ్సీ లో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ పాల్గొని పలు సూచనలు చేశారు. వ్యాదులు, రుగ్మతలు, అనారోగ్య లక్షణాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి,ముందస్తు కార్యాచరణ చేయాలన్నారు.

గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో పర్యటించి గర్భిణులను గుర్తించాలని వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలకు ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గర్భిణీలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారమందేలా చూడాలన్నారు. రోజురోజుకు ఎండల తీవ్రత అధికం కావడం వల్ల గర్భిణీలను ఎక్కువగా ఎండలో తిరగకుండా చూడాలని, ఎండల తీవ్రతపై గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రసవ సమయంలో అత్యవసర పరిస్థితుల్లో 108 సహాయంతో అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. ప్రతి నెల 9న జరుగుతున్న ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన కార్యక్రమానికి గర్భిణీలను ఆసుపత్రికి తీసుకురావాలని, ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రానున్న వేసవి దృష్ట్యా క్యాష ప్రోగ్రాం ద్వారా మండలంలోని మరమ్మతులకు గురైన బోర్లను మరమ్మతులు చేయనున్నట్టు ఎంపిడిఒ రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు క్రాష్‌ప్రోగ్రాం వాహనాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద డిఎల్‌డిఒ రమేష్ రామన్‌తో జెండా ఊపి ప్రారంభించారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు చేతిపంపుల మరమ్మతులు నిర్వహణకు రూ.5 లక్షల వ్యయంతో చేపడుతున్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ బసవరాజు, జగన్మోహన్రావు, బోర్ మెకానికులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మెట్టు పంటలు వేసే రైతులు వర్షపు నీటిని నిల్వ చేసుకొని ఒకటి, రెండు తడులు ఇవ్వడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని కూనంబందవలసలో పొలం పిలుస్తోంది సమావేశంలో మాట్లాడుతూ కోణం మందవలస రెవెన్యూ పరిధిలో ఎక్కువగా పత్తి పంట పండిస్తున్నారని, ఫారం పాండ్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా నీటిని నిలువ చేయవచ్చని, అలాగే వేసవిలో వాలుకు అడ్డంగా దున్నడం వల్ల, కందకం తవ్వడం ద్వారా కూడా నీటిని భూమిలో నిలువ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఫారం పాండ్‌లు, కందకాల ద్వారా నీటిని నిల్వ చేయడం ద్వారా బావులను కూడా రీఛార్జ్ చేయవచ్చని తెలిపారు. రైతులు సాంప్రదాయ పంటల స్థానంలో తక్కువ నీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించే దిశగా ఆలోచనలు చేయాలని, ఎలాంటి పంట పండని ప్రాంతాల్లో నిమ్మగడ్డి వంటి పంటల సాగు చేయడం ం ద్వారా అధిక ఆదాయాన్ని అతి తక్కువ ఖర్చుతోనే పొందవచ్చని సూచించారు. అలాగే పంచాయతీ చెరువుల్లో చేపలు పెంచుకోవడం, వరితో పాటుగా చేపల పెంపకం చేపట్టడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చని, పెరటి కూరగాయలు, పెరటి కోళ్ల పెంపకం వల్ల సమీకృత వ్యవసాయం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. అలాగే నీటి వసతి ఉన్నవాళ్లు వేసవిలో అపరాలు సాగు చేయడం ద్వారా భూమిలో జీవ వైవిధ్యాన్ని పెంచి రాబోయే ఖరీఫ్ సీజన్లో వేసే పంటల ద్వారా మంచి దిగుబడి సాధించవచ్చని, భూమిని వేసవిలో పంటలతో కప్పి ఉంచడం ద్వారా భూసారాన్ని కోల్పోకుండా చూడవచ్చని తెలిపారు. రైతులకు చిరుధాన్యాల సాగు ఎంతో ప్రోత్సాహం ఇస్తుందని, మహిళా రైతు దేవి అన్నారు. కార్యక్రమంలో విఎఎలు అశ్విని, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

టిడిపికి చెంపపెట్టు : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఇటీవల జరిగిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు టిడిపి కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని చెప్పారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వ్యతిరేకతకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అద్దం పట్టాయని చెప్పారు. టిడిపి ప్రభుత్వంలో వున్న మంత్రులు, ఎమ్మెల్యేలంతా ఎపిటిఎఫ్ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ ని గెలిపించాలని ఊరూరా తిరిగి ప్రచారం చేశారని చెప్పారు. గెలిచిన పిఆర్‌టియు అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకు టిడిపి మద్దతు ఇచ్చిందని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రాజన్నదొర అన్నారు.

నేడు మర్రిపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని మర్రిపాడులో బుధవారం సీతంపేట పోలీస్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎస్సై వై.అమ్మనరావు తెలిపారు. ఈ శిబిరానికి సీతంపేట ఏరియా ఆసుపత్రి వైద్యులు విజయ, జేమ్స్ హాస్పిటల్స్ వైద్యులు వస్తున్నారని, ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగించుకోవాలని తెలిపారు.

పరీక్షా కేంద్రం ఆరుబయట విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎండలో వైద్య సిబ్బంది విధుల నిర్వహణ

పట్టించుకోని పరీక్షల నిర్వహణ అధికారులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఏమైనా జరగరాని ఆరోగ్య సమస్యలు తలెత్తితే వారికి సపర్యచర్యలు చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బయట ఎండల్లో చెట్ల కింద విధులు నిర్వహిస్తున్నారు. అది కూడా మండుటెండల్లో, చెట్ల నీడలో విధులు నిర్వహించడం పరిపాటిగా మారింది. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి మాత్రం ఏమైనా జరిగితే ఎవరు సపర్యలు చేస్తారని విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఎండల్లో విధులు నిర్వహిస్తూ, కనీసం తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో సంబంధిత కళాశాల యాజమాన్యాల పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరికి కనీసం కళాశాలలో ఏదో ఒక గదిలో ప్రవేశం కల్పిస్తే విధులు నిర్వహించేందుకు వీలుగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరం

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం కేటాయిస్తున్న రైతు విశిష్ట గుర్తింపు నెంబర్ తప్పనిసరిగా ఉండాలని కురుపాం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ. నిర్మల్ జ్యోతి అన్నారు. మండలంలోని విక్రాంపురం పంచాయతీ నందాపురంలో పొలం పిల్లోస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులంతా సేవా కేంద్రాలలో రైతు విశిష్ట గుర్తింపు నెంబర్ ఖచ్చితంగా చేయించుకోవాలని సూచించారు. దీని ద్వారా రైతులకు వర్తించే అన్ని రాయితీలు పొందాలని చెప్పారు. రైతుల వద్ద ఖాళీగా భూమిలో నిమ్మగడ్డి సాగు చేసి అధిక ఆదాయం పొందాలని రైతులకు అవసరమైన సహాయక సహకారాలు అందిస్తామని తెలిపారు. వెలుగు సంఘాల ద్వారా జీడీ మామిడి కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.శంకర రావు, సహాయకులు ఎం.మౌనిష, రైతులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి సన్మానం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదఅంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రాధాకాంత్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిఐఒ టి.జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించారని, గత నాలుగేళ్లుగా అనేక సేవలందించి మంచి పేరు సంపాదించారని కొనియాడారు. ఉన్నత విద్య కోసం వెళ్లడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.పావని, ఉషారాణి, పి.శిరీష, సంతోష్ కుమార్, సర్పంచ్ బలగ శ్రీనివాసరావు, ఇఒ జి.సూర్యనారాయణ, హెచ్‌వి వరలక్ష్మితో పాటు గ్రామస్తులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రదీప్‌కుమార్

చిదిమిలో వైద్య శిబిరం

మండలంలోని చిదిమిలో మంగళవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. స్థానిక జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం ఉద్దవోలుకు చెందిన నాగళ్ల సింహాచలం (56) కొమరాడ మండలం కల్లికోటకు చెందిన గౌరీశంకర్రావు వద్ద గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. సింహాచలం కుమారుడు విశాఖపట్నంలో పని చేస్తున్నాడు. కుమారునికి ఎన్నిమార్లు ఫోన్ చేసినా రాకపోవడంతో మనస్తాపం చెంది చనిపోవాలని సోమవారం గుమడ సమీపంలో ఉన్న ఇటిక బట్టీల వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. గమనించిన గౌరీశంకర్రావు వెంటనే మోటార్ సైకిల్‌పై పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకుని రాగా వైద్యులు చికిత్స అందించారు. జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. గరుగుబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

80 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

80 లీటర్ల నాటు సారాను చినమేరంగికి చెందిన నాగో అవినాష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా మండలంలోని పూతికవలస సమీపాన కాపుకాసి మంగళవారం పట్టుకున్నామని ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయగడ జిల్లా కెరడలో మాధవ అనే వ్యక్తి నుంచి చినమేరంగికి చెందిన మీసాల ఉపేంద్రకు సరఫరా చేస్తున్నాడని, ఉపేంద్రపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. ఎవరైనా నాటుసారా అమ్మినా, తయారుచేసినా, రవాణా చేసినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.